క్లుప్తంగా

వివాహానికి ఆర్థికసాయం

రాయచోటి అర్బన్ : పట్టణానికి చెందిన ఓ పేదింటి అమ్మాయికి వివాహం నిమిత్తం స్థానిక ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనార్టీ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు గురువారం ఆర్థికసాయం అందించారు. పట్టణంలోని కొత్తపల్లె ప్రాంతానికి చెందిన కరీమూన్ పేదరికం కారణంగా వివాహానికి ఇబ్బందులు పడుతోంది. ఆమె ఈ విషయాన్ని ఆజాద్ సొసైటీ సభ్యులకు తెలియజేయగా, స్పందించిన వారు దాతల ద్వారా సేకరించిన రూ. 9 వేలను కుమార్తె వివాహం నిమిత్తం కరీమూన్‌కు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సాహుల్ హమీద్, ఉపాధ్యక్షుడు మహమ్మద్‌అలీ, కార్యదర్శి సిబాతుర్ రహిమాన్, సభ్యులు ముహిబుల్లా, మౌలానా ఇదాతుల్లా తదితరులు పాల్గొన్నారు.

జూన్ 11న ఆరో తరగతి ప్రవేశపరీక్ష

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరబోయే విద్యార్థులు ఈనెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లీలా శ్రీహరి తెలిపారు. జూన్ 11వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. మండలంలోని ఐదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

కామన్ సెంటర్‌లో రెవెన్యూ స్టాంపులు

పుల్లంపేట : రెవెన్యూ స్టాంపులు మండల కేంద్రంలోని కామన్ సెంటర్‌లో అందుబాటులో ఉన్నట్టు సబ్ పుల్లంపేట రిజిస్ట్రార్ బాషా తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. స్టాంపులకు రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరిగే అవసరం లేదని, స్టాంపులు కావాల్సిన వారు కామన్ సెంటర్‌లో పొందవచ్చని పేర్కొన్నారు.

ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్స్ విద్యార్థుల ప్రతిభ

రాయచోటి టౌన్ : సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో చదివిన విద్యార్థులు 10వ తరగతి పరీక్షలలో అద్భుతమైన ఫలితాలు సాధించారని జిల్లా సంక్షేమ, సాధికారిత అధికారి, తరగతి ఉపాధ్యాయులు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అన్నమయ్య జిల్లావ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ బాలికల, బాలుర హాస్టళ్లలో మూడు మినహా మిగతా హాస్టళ్ల విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత, మూడు హాస్టళ్లలో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించడానికి పరీక్షల సమయంలో ట్యూటర్లు నియమించడంతోపాటు సబ్జెక్టుల వారీగా నిపుణులు, సైకాలజిస్టులను నియమించడం వలనే ఇది సాధ్యమైందని తెలిపారు.

ప్రారంభమైన టెన్నిస్‌బాల్ టోర్నమెంట్

నందలూరు(రాజంపేట) : నందలూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గురువారం ప్రీమియర్ లీగ్ సీజన్-7 ఓపెన్ టు ఆల్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. తొలిరోజు పోటీలు పోటాపోటీగా జరిగాయి. ప్రారంభోత్సవ కార్యక్రమానికి నాయకులు మేడా విజయశేఖర్‌రెడ్డి, జాతీయ మైనార్టీ కమిషన్ సభ్యుడు షబ్బీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ నాయకుడు అరిగె మణి, బీజేపీ నాయకుడు మస్తానయ్య, టీసీ నాయకుడు బూదేల ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా నాయకుడు పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, ఆర్గనైజర్ ముమ్మడిశెట్టి సుధాకర్, నిర్వాహకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

అభినందనలు

రైల్వేకోడూరు : నూతనంగా ఏపీ టూరిజం డైరెక్టర్‌గా నియమితులైన మందల నాగేంద్రను ఆయన స్వగృహంలో గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ముద్దా బాబుల్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో కష్టపడిన వారికి కచ్చితంగా ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు.

శుభాకాంక్షలు

రైల్వేకోడూరు : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌సీపీ యువనాయకుడు ఆకేపాటి రంగారెడ్డి జన్మదిన వేడుకలు అభిమానులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

గొడుగుల పంపిణీ



గొడుగును అందజేస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని చిరు వ్యాపారస్తులకు గురువారం వాసవి చేయూత పథకం కింద రూ.25 వేలు విలువచేసే 62 గొడుగులను వాసవి క్లబ్ తరఫున ఉచితంగా అందజేశారు. వేసవికాలంలో చిరువ్యాపారస్తులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి తిరునామాల కుమార్, కార్యదర్శి సత్యనారాయణ, రీజనల్ చైర్మన్ పెండ్యాల విజయ్ కుమార్, నిరంజన్‌బాబు, గోవర్ధన్‌రావు, సత్యం, మల్లికార్జున, సోమశేఖర్, వెంకట నర్సయ్య, అశోక్‌కుమార్, కిషోర్‌బాబు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం జరిగేలా పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లె : జగన్ పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె మండలం పందిళ్లపల్లె గ్రామంలో నిర్వహించిన గడప గడపకు కార్యక్రమంలో ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మాజీ ఎంపీపీ అంబాపత్తిన రెడ్డయ్యలతో కలిసి శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. పందిళ్లపల్లె గ్రామంలోని కోతలగుట్టపల్లె, నల్లగుండ్లపల్లె, జె.వడ్డెపల్లె, కొక్కంటి వాండ్లపల్లె, శ్రీరాంపురం, దొమ్మరపల్లెలలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి ప్రతి గడపకు వెళ్లారు. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేయని సంక్షేమ పథకాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని శ్రీకాంత్ రెడ్డి చెప్పారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పాలన సాగిస్తున్నారన్నారు.

సమస్యల పరిష్కారం..

కోతలగుట్టపల్లెకు రామాలయాన్ని మంజూరు చేయించామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. తాగునీటి సమస్యలకు పరిష్కారం చూపారు. తాగునీటి బోరును ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చాలని సూచించారు. దివ్యాంగుడు మూడు చక్రాల సైకిల్ ఇప్పించమని తెలపడంతో శ్రీకాంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. జె.వడ్డెపల్లెలో రామాలయంలో శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. జేజేఎం నిధులు రూ. 10 లక్షలతో తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. భువనేశ్వరి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ కావాలని ఆమె తల్లిదండ్రులు కోరడంతో త్వరితగతిన సైకిల్ ఇప్పిస్తామని మాట ఇచ్చారు. కొక్కంటి వాండ్లపల్లెలో రూ. 3.50 లక్షలు జేజేఎం నిధులతో తాగునీటి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించి చిన్నారులతో మమేకమయ్యారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేంద్రనాథ రెడ్డి, ఎంపీటీసీ ఉదయగిరి ఎల్లమ్మ, సర్పంచ్ పసుపుల సుబ్బమ్మ, జిల్లా వ్యవసాయ సలహా సంఘం సభ్యులు దిన్నెపాడు రవిరాజు, తహసీల్దార్ నరసింహులు, ఈఓపీఆర్డీ పట్నాయక్, ఉద్యానశాఖ అధికారి నాగమణి, ఎంఈఓ చక్రేనాయక్, హౌసింగ్ ఏఈ జనార్దన్, వైఎస్సార్ సిపి నాయకులు మల్‌రెడ్డి, నారాయణరెడ్డి, భాస్కర్ రెడ్డి, విశ్వనాథరెడ్డి, నాసిర్, రెడ్డికృష్ణ, లక్ష్మీరెడ్డి, పంచాయతీరాజ్ ఏఈఈ సుబ్రమణ్యం, ట్రాన్స్ కో ఏఈ కృష్ణయ్య, వెలుగు ఏపీఎం నిరంజన్, వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిషోర్, ఏపీఓ పెంచలయ్య, నాయకులు గంగిరెడ్డి, విశ్వనాథ వెంకటరమణ, శేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఇమాం బాషా, కృష్ణారెడ్డి, రాజారెడ్డి, శ్రీరాంరెడ్డి, భరత్ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వివిధ శాఖల సిబ్బంది, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రహదారులను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యం

నియోజకవర్గంలో పల్లెపల్లెను కలుపుతూ రహదారులను నిర్మించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. గురువారం పందిళ్లపల్లె కస్పా రోడ్డు నుంచి గుంటిమడుగు రోడ్డు వయా శ్రీరామపురం, దొమ్మరపల్లె వరకు రూ. 3.85 కోట్లు నిధులతో పూర్తయిన తారురోడ్డు నిర్మాణ పనులను శ్రీకాంత్ రెడ్డి ప్రారంభించారు.

శుద్ధజలం అందించడమే ధ్యేయం

లక్కిరెడ్డిపల్లె : నియోజకవర్గ ప్రజలందరికీ శుద్ధజలం అందించడమే తమ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ సౌరవిద్యుత్ సంస్థ ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లె మండలం కుర్నూతల గ్రామం అగ్రహారంలో ఏర్పాటు చేసిన 2000 ఎల్‌పీహెచ్ సామర్థ్యం ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లను శ్రీకాంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ ప్రాంతాలలో మినరల్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు కావడంపై ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



రాజంపేట : నందలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సిద్దవటం : సిద్దవటం కోర్టు ఆవరణలో శనివారం జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు, ఫిర్యాదుదారులు సద్వినియోగం చేసుకోవాలని సిద్దవటం జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీనివాసకల్యాణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయాధికారిక సేవా సంస్థ సూచనల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను కోర్టు ఆవరణలో నిర్వహిస్తున్నామన్నారు. లోక్ ఆదాలత్ ద్వారా సత్వర న్యాయం సాధ్యమవుతుందన్నారు. రాజీకి ఆమోదయోగ్యమైన కేసులను కక్షిదారులు పరిష్కరించుకోవచ్చన్నారు. సిద్దవటం కోర్టు పరిధిలోని అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

నందలూరులో ర్యాలీ

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లెలోని నందలూరు జూనియర్ సివిల్ కోర్టు నుంచి పంచాయతీ సర్కిల్ వరకు ఈనెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ (కడప) ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీని చేపట్టారు. న్యాయవాదులు హస్తవరం ఆనంద్‌కుమార్, సుబ్బరామయ్య, నూర్ అహమ్మద్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయండి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి

సిద్దవటం : అధికారులకు ఇచ్చిన గృహనిర్మాణాల లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని నియోజకవర్గం ప్రత్యేకాధికారిణి శ్రీలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం గృహనిర్మాణాల పనులపై ఆమె అధికారులతో సమీక్ష జరిపారు. ఆమె మాట్లాడుతూ జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాల విషయంలో సచివాలయ సిబ్బంది పురోగతిని పెంచాలన్నారు. సిద్దవటం గ్రామ పంచాయతీలోని కొంతమంది లబ్ధిదారులు బేస్‌మట్టం వేసి ఆపై పనులు మొదలు పెట్టలేదని, ఇంకొందరు అసలు బేస్‌మట్టం కూడా వేయలేదన్నారు. కావున త్వరితగతిన పనులు మొదలుపెట్టి నిర్మాణాలను పూర్తి చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ ఫణిరాజకుమారి, తహసీల్దారు శంకర్‌రావు, ఈఓపీఆర్డీ పులిరామ్‌సింగ్, ఏపీఎం వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి అవగాహనతోనే క్షయవ్యాధి నివారణ



వ్యాధిగ్రస్తుడి రిపోర్టును చూస్తున్న డా.సృజన

నందలూరు(రాజంపేట) : క్షయవ్యాధిని పూర్తి అవగాహనతోనే నివారించవచ్చని క్షయ వ్యాధి విభాగం వైద్యాధికారిణి సృజన అన్నారు. గురువారం టీబీ రోగుల ఇంటి వద్దకే వెళ్లి వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజంపేట, పెనగలూరు, నందలూరు మండలాల పరిధిలో 60 టీబీ కేసులుండగా, అందులో నాలుగు మొండి రకం క్షయవ్యాధి కేసులు ఉన్నాయన్నారు. లక్షణాలు ఎటువంటివైన మందులు వాడటం ఆపకూడదన్నారు. మొండి రకం క్షయవ్యాధిని నిర్లక్ష్యం చేయడం వలన అసలు మందులకే లొంగని ఎక్స్‌డీఆర్ - టీబీగా మారే ప్రభావం ఉందన్నారు. క్షయ వ్యాధిగ్రస్తుల ఇంటిలో ఆరు ఏళ్లలోపు పిల్లలందరికి గల్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యుడు చంద్రశేఖర్ రెడ్డి, సూపర్‌వైజర్ జయప్రకాశ్, శివరాం, ఎంఎల్‌హెచ్‌పీ ఆరీఫ్‌బాబు, ఏఎన్‌ఎం అంజనమ్మ, నాగమణి, లక్షుమయ్య, ఆశలు పాల్గొన్నారు.

పరికరాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోండి



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఉద్యానశాఖ అధికారులు

రాజంపేట టౌన్ : డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఉద్యానవనశాఖ ఎంఐడీసీ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి గురువారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రైతులు ఏపీఎంఐపీ ద్వారా రాయితీపై పొలాల్లో అమర్చిన బిందు, తుంపర సేద్యం పరికరాల తనిఖీ, బిందు సేద్య పరికరాల ద్వారా ఎరువుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. తనిఖీ నివేదికలో ఏయే అంశాలు పరిశీలించాలన్న విషయాలను వివరించారు. ఉద్యాన అధికారి సురేష్ బాబు డ్రిప్ ద్వారా నీటిలో కరిగే ఎరువుల వినియోగంపై తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఈఓలు గురు సాయి, నజీర్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పదివేల మొక్కలు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పీలేరు గ్రామ పంచాయతీకి పది వేల మొక్కలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించారు. గురువారం సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా మంత్రికి వినతిపత్రం అందజేశారు. పీలేరు పట్టణాన్ని పచ్చదనంతో నింపడానికి సంకల్పించామని, అందుకు తగినన్ని మొక్కలు కావాలని మంత్రిని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి మొక్కలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబరు విక్టరీ వెంకటరమణారెడ్డి, నాగభూషణం, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ కేవీపల్లె మండల యువజన విభాగం కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, నాయకులు రామకొండారెడ్డి మంత్రిని కలసి పలు సమస్యలపై విన్నవించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయండి

రాయచోటి అర్బన్ : రాయచోటి - గున్నికుంట్ల మార్గంలో విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలని మాజీ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పట్టణంలోని గున్నికుంట్ల క్రాస్‌రోడ్డు నుంచి రింగు రోడ్డు వరకు ప్రభుత్వం ఇటీవలే నూతనంగా డబుల్‌రోడ్డును నిర్మించిందని, ఈ మార్గంలో పలు కల్యాణ మండపాలు, మద్యం షాపులు, ఎస్పీ బంగళా, శాసనమండలి డిప్యూటీ స్పీకర్ జకియాఖానంల నివాసాలుండటంతో జనసంచారం, వాహనాల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. అధికారులు తారు రోడ్డును నిర్మించినప్పటికీ మున్సిపాలిటీవారు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో పట్టణ వాసులకు ఇబ్బందిగా ఉందన్నారు. వెంటనే అధికారులు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలంటూ ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఊటీకి సమ్మర్ స్పెషల్ యాత్ర బస్సు



ప్రచారం చేస్తున్న మార్కెటింగ్ టీమ్ సభ్యులు

పీలేరు రూరల్ : ఈ నెల 17 నుంచి మూడు రోజుల పాటు పీలేరు నుంచి ఊటీకి సమ్మర్ స్పెషల్ యాత్ర బస్సు నడుపుతున్నట్లు డీఎం కుమార్ తెలిపారు. గురువారం కరపత్రాలు పంపిణీ చేసి యాత్ర గురించి వివరించారు. ఈ సందర్భంగా డీఎం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పీలేరు నుంచి ఊటీ, కొడైకెనాల్, మున్నార్‌కు ప్రత్యేక బస్సును నడుపుతున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న యాత్రికులు తమ సీటును రిజర్వేషన్ చేసుకోవాలని కోరారు. టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించినట్లు తెలిపారు. అక్కడ పర్యాటక ప్రాంతాలను చూపించడం జరుగుతుందని చెప్పారు. ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని, సద్వినయోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ టీమ్ కె.వి. రమణ, ప్రమీల పాల్గొన్నారు.

అలరించిన చెక్కభజన



చెక్కభజన, గజ్జపూజ నిర్వహిస్తున్న కళాకారులు

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పరిధిలోని ఇసుకపల్లె దళితవాడలో బుధవారం రాత్రి చెక్కభజన అలరించింది. చెక్కభజన గురువు శివ ఆధ్వర్యంలో గ్రామపెద్దల నేతృత్వంలో చెక్కభజన కళాకారులు గజ్జపూజ నిర్వహించారు. రాజంపేట యువనాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెక్కభజన లాంటి సాంప్రదాయ కళలను అంతరించిపోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో నందలూరు ఉపసర్పంచ్ ఇబ్బు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండు మల్లికార్జునరెడ్డి, బీసీ నాయకుడు ఆనాల మధుయాదవ్, మైనార్టీ నాయకుడు సయ్యద్ ఇక్బాల్, మోహర్‌ఖాన్, నాయకులు మధురాజు, కొర్లకుంట సుధాకర్, షేక్ రఫీ తోపాటు ఇసుకపల్లె దళితనాయకులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో నేషనల్ టెక్నాలజీ డే



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎల్లారెడ్డి

రాజంపేట : ఏఐటీఎస్‌లో నేషనల్ టెక్నాలజీ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో రమ్య(మొదటి బహుమతి), సి.నందు(రెండవ బహుమతిని) కైవసం చేసుకున్నారు. వీరికి ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో టెక్నాలజీ పాత్ర ఎంతో కీలకమైందన్నారు. ఈ రంగంలో విద్యార్థులు రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి డా.బి.బాలనాగేంద్రప్రసాద్, టచ్ స్టోన్ ఇన్‌చార్జి పి.విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

• చూడచక్కని సూర్యబింబాలు



రామసముద్రం మండలం గొల్లపల్లెచెరువులో సూర్యుని ప్రతిబింబాలు


ప్రకృతికి కాదేదీ కనువిందు ఆశ్చర్యం. ప్రతి నిత్యం చూపరులను ఆశ్చర్యపరిచే సన్నివేశాలు కోకొల్లలు. ఇలాంటి సన్నివేశం గురువారం రామసముద్రం మండలం గొల్లపల్లెచెరువులో కనిపించింది. ఎర్రటి సూర్యుడు సాయంత్రం 6.30 గంట ప్రాంతంలో సూర్యాస్తమయంలో చెరువులో ఎర్రటి రంగులో మూడు సూర్యబింబాలు, సూర్యకిరణాలు కనువిందు చేశాయి. ఆటుగా వెళుతున్న బాటసారులు, రైతులు చూసి మన చెరువులో సూర్యుడు మూడు ప్రాంతాల్లో ముగ్గురు సూర్యుని వలే ప్రతిభింబాలు భలే ఉన్నాయంటూ ఆనందంతో ఆస్వాధించారు. సూర్యకిరణాలు ఆకాశం నుంచి బాణాల వలే చొచ్చుకుని వచ్చి చెరువు నీటిపై పడిన తీరు మూడు అద్దనాలు వలే కనిపించాయి.

– రామసముద్రం


సందడి వాతావరణంలో వేసవి శిబిరాలు



రాయచోటి అర్బన్: విద్యార్థులతో ఉపాధ్యాయురాలు



సిద్దవటం: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



చిన్నమండెం: వేసవి శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సిద్దవటం : విద్యార్థులు పుస్తకాలను చదవితే పూర్తిగా విజ్ఞానం సొంతమవుతుందని గ్రంథాలయాధికారిణి లక్ష్మీనారాయణమ్మ తెలిపారు. మండల కేంద్రంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, ఆటల పోటీలు వంటి కార్యక్రమాలను నిర్వహించామన్నారు. పిల్లల చేత పద్యాలు వాటి భావాలను చెప్పించారు.

ఆటాపాటలతో సులువుగా ఆంగ్లభాష బోధన

రాయచోటి అర్బన్ : పిల్లలకు ఆట,పాటలతో ఆంగ్ల భాషను సులువుగా బోధించవచ్చని ఉపాధ్యాయురాలు కళావతి అన్నారు. జెవివి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న వేసవి వినోదం కార్యక్రమంలో ఆమె పిల్లలకు ఆటాపాటల ద్వారా ఆంగ్ల భాషను ఆసక్తికరంగా బోధించారు. కార్యక్రమంలో పలు ఆటలను పిల్లలతో ఆడించారు. ఆమె మాట్లాడుతూ పిల్లలకు సులువుగా స్పోకెన్ ఇంగ్లిషు రావాలంటే వివిధ రకాల ఆటలు ఆడిస్తూ వారి భాషా నైపుణ్యాలను పెంపొందించాలంటూ తెలిపారు. ఈనెల 17వతేదీ వరకు వేసవి వినోదం కార్యక్రమాన్ని పిల్లలకోసం ఉచితంగా నిర్వహిస్తున్నట్లు జెవివి కోశాధికారి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో జెవివి నేతలు ఆంజనేయులు, రామయ్య, గంగిరెడ్డి, రవి, బయారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, శివయ్య, రామక్రిష్ణ, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరాన్ని పాఠకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు ఆంజనేయరెడ్డి సూచించారు. వేసవి సెలవులు కావడంతో గ్రంథాలయంలో వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

ఘనంగా పుష్పాభిషేకం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

పెనగలూరు : ఈటమాపురం లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద బుధవారం రాత్రి 11 గంటలకు పుష్పాభిషేకం జరిపారు. తిరుమల బాలాజీ స్వామి ఆధ్వర్యంలో 9 మంది వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టు చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ బత్తిన పెద్దగుండాల్ రెడ్డిలు బెంగుళూరు నుంచి వివిధ రకాల పుష్పాలను తెప్పించారు. పెద్దగుండాల్ రెడ్డి దంపతులు వేదపండితులచే ప్రత్యేక హోమాన్ని నిర్వహించారు. తిరుపతికి చెందిన అన్నమయ్య కీర్తనల సభ్యులచే బృందంచే అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు పూలను అందజేశారు.

తొమ్మిది గ్రామాల్లో భూ సర్వే పూర్తి

రామాపురం : మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని 9 గ్రామాలలో భూ రీ సర్వే పూర్తయిందని తహసీల్దార్ కె.అరవింద్ కిషోర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా గువ్వలచెరువు, నీలకంఠ్రావుపేట, సుద్దమళ్ల, సరస్వతిపల్లె, హసనాపురం, చిట్లూరు, బండపల్లె, పొత్తుకూరుపల్లె, కొమ్మరపల్లె గ్రామాలలో భూ రీ సర్వేను పూర్తి చేశామన్నారు. మిగిలిన గ్రామాల్లోనూ భూ రీ సర్వే త్వరగా పూర్తి చేస్తామన్నారు.

నవోదయలో ఖాళీల భర్తీకి ప్రవేశ పరీక్ష

రాజంపేట : జూలై 22న జవహర్ నవోదయ విద్యాలయం(నారంరాజపల్లె, ఆకేపాడు, రాజంపేట)లో 11వ తరగతి (2023 - 2024)లో ఏర్పడిన ఖాళీల భర్తీకి ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.గీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం, ప్రైవేటు పాఠశాల(ప్రభుత్వంచే గుర్తింపుబడిన)లో 2022- 2023 సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి ప్రవేశపరీక్షకు దరఖాస్తులను కోరుతున్నామన్నారు. తమ దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఈనెల 31 లోపు దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. పూర్తి వివరాలకు నవోదయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

లైంగిక వేధింపులు దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : రెజ్లింగ్ క్రీడాకారులపై బీజేపీ ఎంపి లైంగిక వేధింపులకు పాల్పడటం దారుణమని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజు భూషణ్ అరెస్ట్ చేయాలని దేశ రాజధానిలో ఆందోళన చేస్తే వారిపై దాడులు చేయడం దారుణమన్నారు. డీవైఎఫ్ఐ నాయకులు నాగార్జున, విజయ్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు స్కిల్ డెలప్‌మెంట్ శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక అమ్మచెరువుమిట్ట వద్దనున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో దివ్యాంగులకు స్కిల్ డెలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వనున్నట్లు వెలుగు పాఠశాల కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి తెలిపారు. 15 సంవత్సరాలుపైబడిన దివ్యాంగులకు చేతితో అగర్‌బత్తీల తయారీ, జూనియర్ డేటా అసోసియేట్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, సీవింగ్ మిషన్‌ల నందు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తిగల వారు 7799996609, 7799499333, 8074711472 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వృక్షాల ఆదాయం రూ.17.87 లక్షలు

బి.కొత్తకోట: ముంబై-చెన్నై జాతీయ రహదారి పనుల విస్తరణలో భాగంగా తొలగించిన వృక్షాల ద్వారా రూ.17.87 లక్షల ఆదాయం వచ్చిందని ఎన్‌హెచ్ ఏఈ పి.మధుసూదన్ గురువారం తెలిపారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో బి.కొత్తకోట, కురబలకోట, ములకలచెరువు మండలాల్లో రోడ్డుకు ఇరువైపులా 1,211 వృక్షాలు ఉండగా అటవీశాఖ వాటికి రూ.17.87 లక్షల విలువ కట్టిందని తెలిపారు. వీటిని రోడ్డు విస్తరణ చేపట్టిన కాంట్రాక్టు సంస్థ డబ్బు చెల్లించి తొలగించిందని తెలిపారు.

14న శ్రీరామకోటి మహాయజ్ఞం

వాల్మీకిపురం : మండలంలోని పాతమంచూరులో వెలసిన శ్రీ భక్తాంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 14న శ్రీరామకోటి మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పూజారి రామక్రిష్ణ తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.